

వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులతో జనసంద్రమైన రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రం నేతన్న చౌరస్తా, సభలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

# కేసీఆర్ వెంటే తెలం'గానం'!

- 70 ఏండ్ల వయసులో.. మండుటెండలో ప్రయాణం
- 16 రోజులు సాగిన బస్సుయాత్ర
- రోడ్‌షోలకు జన నీరాజనం
- ప్రత్యర్థుల అంచనాలన్నీ తలకిందులు
- గులాబీ శ్రేణుల్లో సమరోత్సాహం

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రజలు తెలంగాణకు సర్వనామంగా కీర్తిస్తారని మరోసారి నిరూపితమైంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 17 రోజులపాటు ఆయన తెలంగాణ అంతటా కలియదిరిగారు. అన్ని వర్గాల ప్రజలు ఆయనకు తమ కష్టసుఖాలు చెప్పుకున్నారు. 'కేసీఆర్ ఎవరినీ కలువరు. కలవాలనుకున్నవాళ్లకే ఆయన నుంచి పిలుపు వస్తది. పిలుపు అందుకున్నవాళ్లే కేసీఆర్‌ను కలువాలె' అని ఉద్యమకాలం నుంచి ఆయనపై రాళ్లు పడుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు అవి మరింత ఎక్కువయ్యాయి. కానీ, అవన్నీ ఉద్దేశపూర్వకంగా సృష్టించిన అసత్యాలని తెలంగాణ సమాజానికి మరోసారి అనుభవంలోకి వచ్చింది. తెలంగాణ సగటు పల్లెజీవిగా రోడ్డు పక్కన ఉన్న హోటల్‌కు వెళ్లి కూర్చొని పకోడీ తిని, చాయ్ తాగి ఆ హోటల్ యజమానితో పిచ్చాపాటిగా మాట్లాడి కష్టసుఖాలు ఆలకించారు. తన కన్నా ముందే హోటల్‌లో కూర్చున్న రైతులతో ముచ్చట్లాడి వారి 'సాగు' బాగోగులను తెలుసుకున్నారు. తన చుట్టూ గుమిగూడిన ఆడబిడ్డల సాదకబాధలను అడిగి తెలుసుకోవడం, పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థుల హాస్టల్ బాధలకు ఆవేదన చెంది ఆగ్రహం వ్యక్తంచేయడం.. ఆయన బస్సు యాత్ర పొడవునా కనిపించిన దృశ్యాలు. పదేండ్లపాటు అధికార పనుల్లో బిజీగా ఉన్నందున పార్టీ అధినేతను కలుసుకోలేకపోయిన ప్రార్టీ శ్రేణులు, ఉద్యమ సమయంలో అనేక సందర్భాల్లో తనతో కలిసి నడిచిన ఉద్యమసహచరులు, మేధావులు అనేకమంది కేసీఆర్‌ను కలుసుకొని వారి అనుభావాలను నెమరువేసుకున్నారు. బస్సుయాత్ర ద్వారా 17 రోజులపాటు (ఈసీ ఆంక్షల నేపథ్యంలో 48 గంటలు మినహాయింపు) రాష్ట్రాన్ని కలియతిరిగారు. ప్రతి రాత్రి రోడ్‌షో నిర్వహించిన పట్టణంలోనే బస చేసి, ఆ మరుసటి రోజు అందరినీ కలుస్తూ, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 1న మహబూబాబాద్ రోడ్‌షో అనంతరం ఎన్నికల కమిషన్ విధించిన 48 గంటల విధించిన నిషేధం మినహా మిగతా షెడ్యూల్ అంతా యథావిధిగా కొనసాగింది. ముందు ప్రకటించిన షెడ్యూల్‌లో ఒక్క జమ్మికుంట మినహా 17 రోజుల ఆయన షెడ్యూల్‌లో ఏ మార్పూ లేకపోవటం గమనార్హం. కేసీఆర్ రోడ్‌షోలకు జనం బ్రహ్మరథం పట్టడంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం తొణికిసలాడుతున్నది.

### మండుటెండల్లో కేసీఆర్ సింహగర్జన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత నెల 24న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు బయల్దేరిన కేసీఆర్ బస్సుయాత్ర శుక్రవారం సిద్దిపేటతో ముగిసింది. దీంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు కేవలం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కానీ, కేసీఆర్ మాత్రం అందుకు విరుద్ధంగా తన పర్యటనకు రూపల్పన చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నట్టే ఇప్పుడు కూడా వారితో మమేకమయ్యారు.

### మరోసారి కేసీఆర్ ఉద్యమ ఉద్బోధ

రాష్ట్ర సాధన కోసం 2001 నుంచి 2014 దాకా కేసీఆర్ ఏ పాత్ర పోషించారో ఈ 16 రోజులపాటు అదే పాత్రను మరోసారి పోషించారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ వనరులను నాడు ఉమ్మడి పాలకులు కొల్లగొట్టిన వైనాన్ని కండ్లకు కడుతూ ప్రజాచైతన్యాన్ని తట్టిలేపిన విధంగానే, ఇప్పుడూ అదే స్ఫూర్తిని తిరిగి రగిల్చారని తెలంగాణ సమాజం గుర్తుచేసుకుంటున్నది. రాష్ట్ర సాధన అనంతరం పదేండ్లపాటు దేశానికి మార్గదర్శనం చేసిన తెలంగాణ.. కేవలం ఐదు నెలల్లోనే ఆగమైన వైనాన్ని ప్రజలకు విడమరచి చెప్పారు. తెలంగాణ నుంచి బీఆర్ఎస్‌ను, బీఆర్ఎస్ నుంచి తెలంగాణను వేరుగా చూడలేరని, అలా వేరుగా చూడాలని కలలుగన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆశలు అడియాశలే అయ్యాయనడానికి భారీ బహిరంగ సభలను తలపించిన రోడ్‌షోలకు ప్రజల నుంచి వచ్చిన స్పందనే నిదర్శనం. తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి మరెవ్వరికీ ఉండదని రోడ్‌షోలకు హాజరైన ప్రజలు వ్యాఖ్యానించడం గమనార్హం.



సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద జరిగిన రోడ్‌షోకు హాజరైన కేసీఆర్‌ను భారీ గజమాల, గొంగడితో సత్కరించిన దృశ్యం

### భాగస్వామ్య భావోద్వేగం

భావోద్వేగానికి ప్రజా భాగస్వామ్యం తోడైతే ఏం జరుగుతుందో సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న నేతలకు బాగా తెలుసు. ఆ భావోద్వేగం కేసీఆర్‌కై ముడిపడితే ఎలా ఉంటుందో మరోసారి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలకు తెలిసొచ్చింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి సహా ఎవరెన్ని మాటలు చెప్పినా తెలంగాణ ప్రజలకు ఎక్కదు. అదే కేసీఆర్ చెప్తే మాత్రం వినడమే కాదు ఆచరిస్తారు. ఆ ఆచరణే తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గాన్ని వేసింది. సాధించిన రాష్ట్రాన్ని దేశంలో అనేక రంగాల్లో నంబర్ వన్‌గా నిలిపింది. నిజాల ఇజాలపై రాజకీయాలు చేసి ప్రజామోదం పొందిన కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ఇరకాటంలో పెట్టాలని కాంగ్రెస్, బీజేపీలు చేసిన ప్రయత్నాలు ఎంతో కాలం నిలబడలేవని పార్లమెంట్ ఎన్నికల ప్రచారసరళి తేల్చిచెప్పింది. ఈ 17 రోజుల్లో కేసీఆర్ తన ప్రసంగంతో ప్రజలను మమేకం చేశారు. స్థానిక అంశాలను లేవనెత్తడమే కాకుండా అంతకు ముందున్న ఆయన శైలికి విభిన్నతను జోడించారు. 'కల్యాణలక్ష్మికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం వచ్చిండట కదా మీ జగిత్యాలలో..? నిజమేనా? రూ.2 లక్షల రుణమాఫీ వరంగల్ రైతులకు కాంగ్రెస్ సర్కార్ వేసిందట కదా? మోదీ అందరికీ ఇస్తానన్న రూ.15 లక్షలు కరీంనగర్‌లో వచ్చాయట కదా? నిజమేనా? మహిళలకు నెలకు రూ.2500 బ్యాంకుల్లో వేస్తున్నరట కదా.. నిజమేనా? చేవెళ్లల్లో వచ్చాయని రాహుల్‌గాంధీ చెప్తున్నడు కదా? నిజమేనా? ఇలా ఆయా ప్రాంతాల ప్రజా సమూహాలను భాగస్వామ్యం చేస్తూ కేసీఆర్ చేసిన ఛలోక్తులు జనంలోకి బాగా వెళ్లాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ప్రశ్నలు శరాఘాతంగా మారాయి.

### యూత్ ధూం..ధాం..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ చేసిన ప్రచారానికి స్పష్టమైన తేడా కనిపించింది. బీఆర్ఎస్ పార్టీకి యువత దూరం అయిందని, యువతలో బీఆర్ఎస్‌కు ఆదరణ లేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేసీఆర్ బస్సుయాత్ర పటాపంచలు చేసింది. కేసీఆర్ ప్రసంగించిన రోడ్‌షోలు, బస్సుయాత్రలో అత్యధికంగా పాల్గొన్నది యువతే కావడం గమనార్హం. కేసీఆర్ సైతం ప్రతి ప్రసంగంలో యువతకు భవిష్యత్తు కార్యాచరణను దిశానిర్దేశం చేశారు. తన పార్టీ శ్రేణులకు ఏ స్థాయిలో కేసీఆర్ మార్గనిర్దేశనం చేశారో అదే స్థాయిలో యువతకు ప్రబోధించారు. బస్సుయాత్రల్లో కేసీఆర్ కనిపించగానే 'జై కేసీఆర్..' అని యువత నినదిస్తూ ముందుకు సాగింది. తమ ప్రాంత పొలిమేరల దగ్గర కేసీఆర్ కోసం వేచి ఉండి, ఆయన బస్సు కనిపించగానే కేరింతలు కొడుతూ ర్యాలీగా కేసీఆర్‌ను తోడ్కొని రావడం ప్రతిచోటా యువత తమ ధర్మంగా భావించింది. అనేకచోట్ల పార్టీలకు అతీతంగా గ్రామ యువజన సంఘాలు బ్యానర్లు పట్టుకొని కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికిన దృశ్యాలు ఉద్యమ కాలం నాటి సన్నివేశాలను గుర్తుచేశాయి.

> మోదీ చెప్పిన సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమైంది? అమృత్‌కాల్ వచ్చిందా? అచ్ఛేదిన్ వచ్చిందా? బేటీ పడావో బేటీ బచావో ఏమైనా వచ్చిందా? జన్‌ధన్ ఖాతా ఏమైంది? అంటే ఏమీ రాలేదు. అంతా గ్యాస్.. ట్రాష్. డబ్బాలో రాళ్లు వేసినట్టు ఊపటం తప్ప, ఏ పేదకూ ఏం జరగలె.
>
> - కేసీఆర్

## కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తరు

**హామీలపై మోసం చేసిందని ఆగ్రహం**

- రాష్ట్రంలో బీజేపీకి గుర్తింపు లేదు
- కేంద్రంలో ప్రాంతీయ పార్టీలదే అధికారం
- ఇండియా టుడే ఇంటర్వ్యూలో కేసీఆర్

*హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అలవిగాని హామీలు ఇచ్చి తమను మోసం చేసిందని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఆగ్రహాన్ని చూపిస్తారని చెప్పారు. శుక్రవారం ప్రముఖ జాతీయ చానల్ 'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కేసీఆర్ పలు విషయాలపై మాట్లాడారు. రాష్ట్రంలోని పరిస్థితులు, బీఆర్ఎస్ ప్రచారం, తన ఆరోగ్యం తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.*

***ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదని మీరు పదే పదే చెప్తున్నారు. కారణం ఏమిటి?***

*అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ శక్తికి మించిన హామీలు ఇచ్చింది. వాటిని అమలు చేయడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా సహకరించదు. ఈ విషయం వాళ్లకు కూడా తెలుసు. ఐదు నెలల పాలన తర్వాత ప్రజలు వాస్తవాలను గ్రహించారు. కాంగ్రెస్ తమను మోసం చేసిందని వారికి అర్థమైంది. అందుకే ఆ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఎన్నికల్లో అది స్పష్టంగా కనిపించబోతున్నది.*

***రాష్ట్రంలో బీజేపీ క్రమంగా ఓట్ల శాతాన్ని పెంచుకుంటున్నది కదా?***

*గోబెల్స్ ప్రచారం చేయడంలో బీజేపీ ప్రపంచ చాంపియన్. వాస్తవాలను పరిశీలిస్తే 2014లో 119 నియోజకవర్గాలకుగానూ 117 స్థానాల్లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 64 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. దీనిని బట్టి క్షేత్ర స్థాయిలో బీజేపీకి ఎలాంటి గుర్తింపు లేదని స్పష్టం అవుతున్నది.*

***మీరు గతంలో మోదీ ప్రభుత్వానికి సహకరించారు, వ్యవసాయ చట్టాలకు కూడా మద్దతు తెలిపారు కదా?***

*2014లో మాది కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. ఆ సమయంలో మాకు కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఎంతో అవసరం. రాజ్యాంగపరంగా చూసినా కూడా కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలి. ఈ మేరకు కేంద్రంతో సానుకూలంగా ఉన్నాం. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ఎలాగూ వాళ్లు గెలుస్తారు, పైగా వాళ్లు మా మద్దతు కోరారు కాబట్టి మద్దతిచ్చాం. బీజేపీ తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు మేము మద్దతు ఇవ్వలేదు. పూర్తిగా వ్యతిరేకించాం, నల్లచట్టాలపై జాతీయ స్థాయిలో పోరాటాలు చేశాం.*

***ఇండియా అలయన్స్ ప్రభావం ఎలా ఉండబోతున్నది?***

*వాస్తవానికి ఇప్పుడు ఇండియా కూటమి అనేదే లేదు. అదొక భ్రమ మాత్రమే. మమతా బెనర్జీతోపాటు చాలా మంది కూటమి నుంచి బయటికి వచ్చేశారు. నేను, అరవింద్ కేజ్రీవాల్, జగన్మోహన్‌రెడ్డి వంటివాళ్లు ఏ కూటమిలోనూ లేము. కాంగ్రెస్ అనుకూల పార్టీలు మాత్రమే ఇండియా కూటమితో ఉంటే, చాలా తక్కువ పార్టీలు మాత్రమే ఎన్డీయేలో ఉన్నాయి. ఈ రెండు కూటముల మధ్యే పోటీ అనే భావన సరికాదు. ఎన్నికల తర్వాత ప్రాంతీయ పార్టీలే బలమైన శక్తిగా మారి, రాజ్యమేలబోతున్నాయి.*

***మీరు అనారోగ్య సమస్యల నుంచి బయటపడి ప్రజలను కలుస్తున్నారు. ఎలా అనిపిస్తున్నది?***

***జవాబు:*** *ఎన్నికలు పూర్తికాగానే అనుకోకుండా తుంటి ఎముక విరిగింది. దాదాపు రెండు నెలలు బెడ్ రెస్ట్‌లో ఉన్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం చాలా మెరుగుపడింది. నడువగలుగుతున్నా. బస్సుయాత్ర నిర్వహించడం, ప్రజలను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉన్నది. ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మాండంగా ఆదరిస్తున్నారు.*

***ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్‌పై మీ స్పందన?***

*ఈ కుంభకోణం మొత్తం ప్రధాని మోదీ సృష్టించిన ఒక రాజకీయ కుట్ర. లెఫ్టినెంట్ గవర్నర్ లేఖ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశించి, లేని కుంభకోణాన్ని జరిగినట్టుగా చిత్రీకరించింది. వాస్తవానికి ఇది బీజేపీ సృష్టించిన రాజకీయ కుంభకోణం మాత్రమే. అది ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానం. ప్రభుత్వం తెచ్చిన పాలసీని కుంభకోణం అని ఎవరైనా అంటారా? మోదీ సృష్టించిన కట్టుకథలు కాకపోతే.. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారు? రెండున్నరేండ్లుగా వాళ్లు అరుస్తూనే ఉన్నారు తప్ప ఆధారాలేవి? కవిత, అరవింద్ కేజ్రీవాల్ వంటి అమాయకులను అరెస్ట్ చేస్తున్నారు, వేధిస్తున్నారు.*



సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద కేసీఆర్ రోడ్‌షోకు భారీగా హాజరై సీఎం.. సీఎం..జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు

## తొడగొట్టిన బీఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి...

ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి బీఆర్ఎస్ పార్టీనే గట్టి పోటీ ఇస్తున్నది. బీజేపీ, కాంగ్రెస్‌కు మొగ్గు ఉంటుందనుకున్న స్థానాల్లోనూ ఇప్పుడు తీవ్ర పోటీ నెలకొన్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎక్కువ మంది మాజీ బీఆర్ఎస్ నాయకులే. పార్టీని నేతలు విడిచిపోతున్న సమయంలో బీఆర్ఎస్ బలహీనపడుతున్నదని అనుకుంటుండగా బీసీలకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కేసీఆర్ పార్టీకి కొత్త బలాన్ని అందించారు. ముఖ్యంగా బీసీ ఓట్లు ఎక్కువ ఉన్న స్థానాలను బీఆర్ఎస్ పార్టీ బీసీలకు కేటాయించింది. ముదిరాజ్‌లు ఎక్కువగా ఉన్న చేవెళ్ల స్థానం నుంచి ముదిరాజ్ సామాజికవర్గ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను పోటీకి నిలిపింది. జహీరాబాద్‌లో బీజేపీ, కాంగ్రెస్ లింగాయత్ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వగా, కేసీఆర్ వ్యూహాత్మకంగా ఈ నియోజకవర్గంలో గణనీయ సంఖ్యలో ఉన్న మున్నూరు కాపు సామాజికవర్గ నేతను బరిలో నిలిపింది.

### కేసీఆర్ ప్రసంగాలతో ఫిదా

మరోవైపు కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్‌షోలతో జనంలోకి వెళ్లడంతో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న కరెంట్, రైతు సమస్యలు, సాగు, తాగునీటి సమస్యలను కేసీఆర్ లేవనెత్తినప్పుడు జనం నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తున్నది. బస్సుయాత్రలో ఆయన రోడ్డు పక్కన చిన్న చిన్న హోటళ్ల వద్దకు వెళ్లి స్నాక్స్ తింటూ ప్రజలతో మమేకం అవుతున్న తీరుకు వారు ఫిదా అవుతున్నారు. కాగా, రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీలు చేసిన అన్యాయానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఈ కథనం ప్రస్తావించింది. ఈ క్రమంలో కేంద్రంలో పదేండ్ల బీజేపీ పాలన, రాష్ట్రంలో ఐదు నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఫలితంగా తమకు 10 నుంచి 12 స్థానాలు రాబోతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారని ఉటంకించింది.

## నేడు కేసీఆర్ ప్రెస్‌మీట్

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన మీడియాతో మాట్లాడనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం సిద్దిపేటలో ముగిసింది. బస్సు యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన, రోడ్ షోల ద్వారా మెరుగుపడిన పార్టీ విజయవకాశాలు, జాతీయ స్థాయిలో ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపై ఆయన మాట్లాడే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.